జగద్గిరిగుట్ట బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి5: దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయం 53వ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ ప్రతినిధులు కోరారు. ఈమేరకు సోమవారం కార్యక్రమ వివరాలతో కూడిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈనెల13 నుంచి మూడురోజుల వేడుకల్లో భాగంగా 13న అంకురార్పణ, 14న కల్యాణం, 15న గ్రామోత్సవం ఉంటాయి. వేడుకలు, భక్తుల సౌకర్యంకోసం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, ఆలయచైర్మన్ వేణుయాదవ్, ఈవో కృష్ణమాచార్యులు, ఎస్సై రంజిత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నేతలు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ మీటర్‌కు ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలి

దుండిగల్,ఫిబ్రవరి 5: విద్యుత్ వినియోగదారులు తమ ఎలక్ట్రికల్ మీటర్ సర్వీస్‌కు ఫోన్ నంబర్‌ను లింక్‌చేసుకోవాలని ప్రగతినగర్ ఏఈ.డేగ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తద్వారా ప్రతినెలా చెల్లించాల్సిన బిల్లులకు సంబంధించిన మెసేజ్‌లను ఎప్పటికప్పుడు వినియోగదారులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అదేసమయంలో ఏదేని కారణంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేయాల్సి వచ్చినప్పుడు సైతం లింకైన ఫోన్ నంబర్‌కు సందేశం వస్తుందని తెలిపారు.

మహిళల పొదుపే కుటుంబ వృద్ధికి కీలకం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘాల ఆర్‌పీలు

మియాపూర్, ఫిబ్రవరి 5 : మహిళల పొదుపే కుటుంబ వృద్ధికి కీలకమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ప్రతి మహిళ పొదుపుతో మదుపు చేసుకునేలా వారిలో అవగాహన నింపాలని ఇందుకోసం పొదుపు సంఘాల ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలన్నారు. తమ సమస్యల పరిష్కారంపై చందానగర్ సర్కిల్‌కు చెందిన మహిళా పొదుపు సంఘాల ఆర్‌పీలు ఎమ్మెల్యే గాంధీని సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహిళాభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆర్థికంగా ఎదిగేలా ఎన్నో మార్గాలను చూపారన్నారు. సంఘాల ప్రతినిధులు సైతం తమ పరిధిలోని మహిళలను చైతన్య వంతులను చేసి ఆర్థిక శక్తిగా ఎదగేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. మహిళా సంఘాల ఆర్‌పీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన హనుమాన్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం

కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులను అభినందించారు. కాలనీ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు.

స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న నియోజకవర్గ ప్రజలు

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి5: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పందిస్తూ ఆయా విభాగాల అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

జగద్గిరిగుట్ట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు

దుండిగల్,ఫిబ్రవరి 5: ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజును సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, సంక్షేమసంఘాల ప్రతినిధులు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజా సమస్యల పరిష్కారానికి తాను చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనండి..

ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరుగనున్న జగద్గిరిగుట్టలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలంటూ ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏ.వేణుయాదవ్, ఈవో.కృష్ణ మాచార్యులు, గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విజయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

దుండిగల్,ఫిబ్రవరి5: కాసాని కౌసల్య ముదిరాజు మెమోరియల్ 49వ జాతీయ స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్-2024 ఓవరాల్ ఛాంపియన్‌గా ఎస్ ఏఐ(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నిలిచింది.ఆదివారం రాత్రి పొద్దుపోయో వరకు జరిగిన ఫైనల్ పోటీలల్లో తమిళనాడు మహిళా జట్టుతో తలపడిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా జట్టు పోటీలో గెలిపొందగా,పురుషుల విభాగంలో రాజస్థాన్ జట్టుపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విజయం సాధించింది.జాతీయ స్థాయిలో నాలుగురోజుల పాటు జరిగిన ఈ పోటీలల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 30 బాలికల జట్లు,30 బాలుర జట్లు పాల్గొన్నాయి.అనంతరం నిర్వహకులు విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ అసోసియోషన్ డైరెక్టర్,సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజు,అమెచ్యూర్ కబడ్డీ అసోసియోషన్ జాతీయ ఉపాధ్యక్షులు కాసాని వీరేశ్‌ముదిరాజు,స్థానిక కార్పొరేటర్లు కాసాని సుధాకర్‌ముదిరాజు,కాసాని శిరీష తదితరులు పాల్గొన్నారు.

కనిపిస్తే కరుస్తున్నయ్..

- కొంపల్లిలో రెచ్చిపోతున్న వీధికుక్కలు
- ఎన్‌సీఎల్‌లో ఇప్పటి వరకు 70 మందికి పైగా దాడి
- తాజాగా మరో ఇద్దరిపై ..
- అధికారుల హడావుడే తప్ప.. చర్యలు శూన్యం

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి5: కొంపల్లి మున్సిపాలిటీ.. వీధికుక్కల బెడదకు అడ్రస్‌గా మారింది. కొన్ని రోజులుగా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా జనాలపై పడి దాడికి పాల్పడుతున్నాయి. ఈ ప్రమాదంలో చిన్నపిల్లలు, వృద్ధులు గాయాలపాలైన సంఘనటనలు ఉన్నాయి. ఓ చిన్నారి ప్రాణాపాయ పరిస్థితిలో నెలలు తరబడి ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా అధికారుల్లో మార్పు రావడం లేదు. దాడి చేసినప్పుడే హడావుడిగా పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా అడపదడపా చర్యలు తీసుకోవడమే తప్పా వీధికుక్కల దాడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించే పరిస్థితిలో కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఎన్‌సీఎల్ కాలనీలో దాదాపుగా ఇప్పటి వరకు 70 మందికి పైగా చిన్నారులు, వృద్ధులపై దాడికి పాల్పడగా తాజాగా కాలనీకి చెందిన తన్విహ(5) చిన్నారితో పాటు రేణుక(35) మహిళపై దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులు స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సమయంతో పాటు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళలపై ఆ కాలనీల్లో వీధికుక్కల దాడి పరిపాటిగా మారింది. కాలనీ వాసులంతా వీధికుక్కల నుంచి తమకు రక్షణ కల్పించండి మహాప్రభో అంటూ చిన్నారులతో కలిసి ర్యాలీలు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయినా ఇక్కడి అధికారులకు శరమామూలుగా మారింది. ఇదేతంతు ఉంటే వీధికుక్కలతో ప్రాణాపాయపరిస్థితి తప్పదేమోనని భయంగుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. దీనిపై జిల్లాస్థాయి అధికారులు స్పందించి కొంపల్లిలో కుక్కల బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రధానంగా ఎన్‌సీఎల్ కాలనీవాసులు కోరుతున్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో రోడ్డు ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 5 : కేపీహెచ్‌బీ కాలనీలోని కూకట్‌పల్లి మండల తాసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు ఆక్రమణలపై ట్రాఫిక్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కేపీహెచ్‌బీ కాలనీ ట్రాఫిక్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో రోడ్డుకిరువైపులా ఉన్నటువంటి పూలు, పండ్ల దుకాణాలను 4 ఫీట్లు వెనక్కి జరిపించారు. ఈ మార్గంలో రోడ్డుకిరువైపులా పూలు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ సమస్యలు గుర్తించి ట్రాఫిక్ అధికారులు రోడ్డుకిరువైపులా 4 ఫీట్లు వెనక్కి జరుపుతూ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ వెంటనే వాటిని అమలయ్యేలా పనులు చేపట్టారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్యాడ్మింటన్ చాంప్ ఇన్ఫోసిస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని గేమ్‌పాయింట్ వేదికగా జరిగిన కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో టీమ్ ఇన్ఫోసిస్ టైటిల్ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన తుది పోరులో టీమ్ అప్టస్‌పై, టీమ్ ఇన్ఫోసిస్ విజయం సాధించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో రుత్విక్‌దాస్(ఇన్ఫోసిస్) 30-23తో గీత(జేపీఎమ్‌సీ)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ ఆఖరి పోరులో ప్రణవ జైన్ విజేతగా నిలిచాడు. పురుషుల డబుల్స్‌లో సతీశ్‌బాబు, శ్రీరామ్ జోడీ 30-22తో భరత్, మనోజ్ ద్వయంపై గెలిచింది. పోటీల ముగింపు కార్యక్రమానికి కేఎస్‌జీ గ్రూపు చైర్మన్ అభిషేక్‌రెడ్డి హాజరై ట్రోఫీలు అందజేశారు.

త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డికి శుభాకాంక్షలు

త్రిపుర గవర్నర్‌గా ఇటీవల నియమితులైన నల్లు ఇంద్రాసేనారెడ్డిని సోమవారం నిజాంపేట్‌కు చెందిన 'విశ్వగురు వరల్డ్ రికార్డు' సంస్థ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు, సలహా మండలి సభ్యులు లక్ష్మీకాంతం, కృష్ణాధిశేషు,డా.ఎంఆర్ఎస్.రాజు, డి.ఎల్లాసుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంద్రాసేనారెడ్డికి తైలవర్ణ చిత్రపటం అందజేయడంతో పాటు శాలువా కప్పి సత్కరించారు.

– దుండిగల్, ఫిబ్రవరి5

'మానవమేధపై కృత్రిమ మేధ ప్రభావం' పై సదస్సు

దుండిగల్,ఫిబ్రవరి 5: కృత్రిమ మేధ అభివృద్ధితో సమాజంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయని,దాని ప్రభావం మానవ మేధస్సుపైనా పడిందని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) హైదరిబాద్ శాఖ చైర్మన్ డా.ఎస్.ఆనందరెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,ప్రగతినగర్‌లోని విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం 'మానవమేధపై కృత్రిమ మేధ ప్రభావం అనే అంశం'పై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డా.ఎస్ ఆనందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సిగ్నిటీస్ టెక్నాలజీస్ అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ కొమ్మిరెడ్డి శిరీష, 360 డిగ్రీస్ లెర్నింగ్ సొల్యూషన్స్ సీఈవో ఎజాజ్‌హుస్సేన్, ఇంకా గ్లోకెమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి హరిశంకర్, జోదాస్ ఎక్స్‌పోఎం ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఆనంద్‌విజయ్, ఐఎస్‌టీడీ వైస్‌చైర్మన్ డా.కే,శ్రీనివాసరావు, ప్రో.క్రిష్ణమోహన్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివస్వాములకు మధ్యాహ్నం భిక్ష.. అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డు శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 5 : శివమాల ధరించిన స్వాములకు మధ్యాహ్నం భిక్షను అందించడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డులోని శివాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన శివస్వాములకు మధ్యాహ్నం భిక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ స్వాముల కోసం భిక్షను (అన్నసమారాధన) చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పి.వి.శ్రీరమణ, ఉపేందర్‌రెడ్డి, పులి మురళి, పాతూరి గోపి, భక్తులున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ అభిలాష

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 5 : కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణికి 57 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ అభిలాష తెలిపారు. మూసాపేట సర్కిల్‌లో 6, కూకట్‌పల్లి సరిల్ 1, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 3, గాజులరామారం సర్కిల్‌లో 12, అల్వాల్ సర్కిల్‌లో 14, కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో 21 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

సమస్యలపై ఫిర్యాదులు..

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి5: ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజవాణిలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో 12 సమస్యలపై ఫిర్యాదులు రాగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో 3 సమస్యలపై ఫిర్యాదులు అందిన్నట్లు అధికారులు తెలిపారు. అధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలతో పాటు ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఫిర్యాదులు రావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జంట సర్కిల్ కార్యాలయాల ఉపకమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో సమస్యలను స్వీకరిస్తున్న డీసీ మల్లారెడ్డి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

మియాపూర్, ఫిబ్రవరి 5 : మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏ నగర్ కాలనీలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రహదారులు, డ్రైనేజీలు ఇతర వసతుల కల్పనపై విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కాలనీలో పూర్తి స్థాయిలో డ్రైనేజీతో పాటు మంజీరా నీరు, సీసీ రహదారుల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అభివృద్ధి పనులను జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని నాణ్యత లోపాలు లేకుండా చూడాలని కార్పొరేటర్ శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సునీత, నవీన్, లింగయ్య, స్థానిక నేతలు రవి, రాజు, విజయ్, శివ, జంగం, మల్లేశ్, రాములు, నారాయణ, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి

బాలానగర్, ఫిబ్రవరి 5 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఫతేనగర్ డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేసినట్లు కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురంలో రూ.30 లక్షల నిధులతో ఇటీవల వేసిన సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫతేనగర్ డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె. రాములు, కె భిక్షపతి, ఇమ్రాన్, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలపై పాదయాత్ర

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి5: మౌలిక వసతుల ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ జగన్ తెలిపారు. జగద్గిరిగుట్ట డివిజన్ సోమయ్యనగర్‌లో సోమవారం ఆయన పరిశీలన చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించేలా అధికారులతో మాట్లాడతానన్నారు. శేఖర్‌యాదవ్, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, రాజు, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జగన్

కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా సునీల్ యాదవ్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 5 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా జిట్టా సునీల్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సునీల్ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం తనకు కో ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించిందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కౌన్సిలర్లు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్‌కృష్ణ, మహేందర్‌యాదవ్ తదితరులు

దుండిగల్,ఫిబ్రవరి 5: దుండిగల్ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తున్నదని మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు డీ.పోచంపల్లిలోని సాయిబాబానగర్, మాధవరావునగర్, గాయత్రినగర్‌లలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు, రూ.50లక్షల నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం కౌన్సిలర్ బండారి మహేందర్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపనచేశారు. అదేవిధంగా 1వ వార్డు పరిధి, గాగిళ్లాపూర్ జగన్ వెంచర్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ కుంటి అరుణనాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, కౌన్సిలర్లు భరత్‌కుమార్, సాయిబాబా ఆయా వార్డులకు చెందిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ మల్లంపేట్‌లోని సాయిబాలాజీ ఎన్‌క్లేవ్‌లో పర్యటించారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 5 : మూసాపేట అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతో పాటు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ నేతలు శేరి సతీశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు పి.కృష్ణ, కర్క డాకయ్య, సాయి, నర్సింగరావు, సురేశ్ ఉన్నారు.

బాలానగర్‌లో ఇద్దరు అదృశ్యం

శిలిష (ఫైల్)

బాలానగర్, ఫిబ్రవరి 5 : గృహిణి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పీ. నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి ఎన్టీఆర్‌నగర్‌లో నివాసముండే నర్రా అశోక్ భార్య నర్రా శిరీష (23) గృహిణి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల1వ తేదీన అశోక్ డ్యూటీకి వెళ్లి సాయంత్రం 5.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా భార్య శిరీష ఇంట్లో కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛ్ ఆఫ్ వచ్చింది. శిరీష ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త అశోక్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మతి స్థితిమితంలేని వ్యక్తి..

పోశెట్టి (ఫైల్)

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి గిరినగర్‌కు చెందిన చందుబట్ల పోశెట్టి (63)కి కొంత కాలంగా మతిస్థిమితం ఉండడం లేదు. జనవరి 30వ తేదీన ఉదయం 4 గంటలకు లేచి చూడగా పోశెట్టి కనిపించలేదు. ఆయన ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేక పోవడంతో కుమారుడు బాలానగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈమేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

4వ అదనపు జిల్లా జడ్జ్ కోర్టు, మహబూబ్‌నగర్
ఓఎస్.నెం.19/2015

బిట్వీన్ :
శ్రీ కొత్త చెన్నయ్య మరియు ఇతరులు ... వాది
మరియు
శ్రీ కొత్త సత్యనారాయణ మరియు ఇతరులు ... ప్రతివాదుల పై కేసును శ్రీ కొత్త చెన్నయ్య మరియు ఇతరులు సత్యనారాయణ మరియు ఇతరులు జర్ఖర్ల గ్రామ శివారులోని సర్వే నెం.354, 355, 357 లో గల భూమిపై భాగపరిష్కారం గురించి సివిల్ దావా ఓ.ఎస్. నెం. 19/2015 కేసు వేయడం జరిగినది. ఇట్టి కేసులో ప్రతివాదులుగా చేర్చబడిన (1) శ్రీ ఉదుదల సంతోషికుమార్ తండ్రి వి. మల్లప్ప, నివాసము: బ్లాక్ నెం.1, జూబ్లి ఎన్‌క్లేవ్, అక్షయ్ గెస్ట్ ఇన్ అపార్ట్స్, మాధాపూర్, హైద్రాబాద్ గారిని పై కేసులో 117వ ప్రతివాదులుగా చేర్చడం జరిగినది. పై వారికి కోర్టు ద్వారా సమన్స్ మరియు నోటీసులు అందకపోవడం వల్ల కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా పై కనబర్చిన ప్రతివాదులకు తెలియజేయడం ఏమనగా పై కేసు నందు తమరు ప్రత్యేకంగా గాని తాము నియమించుకున్న న్యాయవాది ద్వారా గాని ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా పైన తెలిపిన కోర్టు వారి ముందు తేది 09-02-2024 నాడు ఉదయం 10:30 గం॥లకు హాజరు కావాల్సిందిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయనైనది. కావున బహిరంగ ప్రకటనను పురస్కరించుకొని తేది 09-02-2024 నాడు కోర్టు ముందు హాజరు కాగలరని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

టి. శ్రీనివాస్ గౌడ్, అడ్వకేట్,
ఇం.నెం.1-65/2, కోర్టు ఎదురుగా, జడ్చర్ల
మహబూబ్‌నగర్. సెల్:9848804679

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి